

సర్టిఫికేట్లు..!

- ఆరోగ్యశాఖలో వందలాదిమంది నకిలీలు
- తప్పుడు మార్కుల జాబితాతో డీ గ్రూపులో ఉద్యోగాలు
- కలబురగి జిల్లాలోనే 185మంది
- విచారణలో వెల్లడి

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖలో నకిలీలు చేరిపోయారు. ఎస్ఎస్ఎల్‌సీ మార్కుల జాబితాను సమర్పించి వందలాదిమంది అభ్యర్థులు ఆరోగ్యశాఖలో డీ గ్రూప్ ఉద్యోగాలలో చేరిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నకిలీ మార్కుల జాబితాలతో జలవనరులశాఖలో బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు పొందడంపై వివాదం కొనసాగుతున్న తరుణంలోనే ఆరోగ్యశాఖలోనూ నకిలీల ప్రభావం ఉన్నట్లు తేలింది. అవినీతి బయట పడడంతో ప్రతిభావంత అర్హులైనవారు బెంబేలెత్తే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో పీఎస్ఐ, కేఈఏ, కేపీటీసీఎల్ నియామకపు పరీక్షల్లో అక్రమాల ద్వారా ప్రతిభావంతులకు పరీక్షలు, నియామకాలపై విశ్వాసం లేకుండాపోయినట్లయ్యింది. ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉండే 1582 డీ గ్రూప్ ఉద్యోగాల భర్తీకై వైద్య ఆరోగ్య సేవల డైరెక్టరేట్ 2015 మార్చిలో గెజిట్ జారీ చేసింది. విద్యార్హతను పదో తరగతిగా నిర్ణయించారు. నవంబర్‌లో కౌన్సెలింగ్ ద్వారా నియామకపు ఆదేశాలు ఇచ్చారు. ఉద్యోగంలో చేరినవారు తప్పుడు పదో తరగతి మార్కుల జాబితాలను సమర్పించి ఉద్యోగంలో చేరారనే ఫిర్యాదులు వచ్చాయి. ఇందుకు సంబంధించి మార్కుల జాబితా వాస్తవాలను పరిశీలించేందుకు కర్ణాటక విద్య పరీక్ష మౌల్యమాపన విభాగాన్ని ఆరోగ్యశాఖ కోరింది. నియామకం వేళ అభ్యర్థులు సమర్పించిన మార్కుల జాబితాకు పరీక్షా మండలి వివరాలకు పొంతనలేకుండా పోయింది. పరీక్షా మండలి ఈ అభ్యర్థులకు మార్కుల జాబితానే ఇవ్వలేదని నివేదిక తేల్చింది. నకిలీ మార్కుల జాబితాతో ఉద్యోగాలు పొందారు. జిల్లా, తాలూకా, కమ్యూనిటి సెంటర్ ఆసుపత్రుల్లో సేవలందిస్తున్నారు. నకిలీ మార్కుల జాబితాతో ఉద్యోగంలో చేరిన మోసపూరిత అభ్యర్థుల వివరాలతో ఫిర్యాదు చేశారు. నకిలీ మార్కుల జాబితాతో ఉద్యోగులు పని చేస్తున్నారనే విషయం వెలుగులోకి రావడంతో ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఈమేరకు వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టరేట్ అధికారులు రాష్ట్రంలోని అన్ని జిల్లా వైద్యాధికారులకు లేఖలు పంపారు. నకిలీ డీ గ్రూప్ ఉద్యోగులకు సంబంధించి శాఖాపరమైన విచారణ చేపట్టాలని నిర్ణయించారు. ఉద్యోగుల జన్మదినం, డ్యూటీలో చేరిన రోజు, నియామకపు పత్రం, పర్మనెంట్ అడ్రస్, నియామకం వేళ సమర్పించిన ఇతరత్రా పత్రాలు, మార్కుల జాబితాతోపాటు అన్ని సర్టిఫికెట్‌లపైనా సమాచారం సేకరించాలని సూచించారు.

నియామకం వేళ సాధారణ పరీక్షలు లేకుండా ఉద్యోగంలో చేర్చుకున్నారు. అత్యధిక మార్కులు పొందినవారినే అర్హులు చేశారు. హైస్కూల్ పరీక్షా మండలి ఇచ్చిన మార్కుల జాబితాయే సరైనదని పరిగణించారు. విషయాన్ని ముందుగానే గుర్తించిన అభ్యర్థులు అన్ని సబ్జెక్టులలోనూ 90-95 శాతం మార్కులు ఉండేలా సవరణలు చేసుకుని రూపొందించారు. ఇలా నియామకపు ప్రాధికార ప్రాథమికంగా ఇవి నకిలీవని గుర్తించే పరిస్థితి లేకుండా పోయింది. రెండు రోజులక్రితం ఈ అంశం వెలుగులోకి రావడంతో జిల్లాలవారీగా నకిలీ జాబితా ద్వారా ఉద్యోగంలో చేరినవారికి వణుకు పట్టుకుంది.

కొవిడ్ అక్రమాలపై విచారణకు కేబినెట్ నిర్ణయం

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ కాలంలో సాగిన అక్రమాలపై సమగ్ర విచారణకు కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన కేబినెట్ భేటీ జరిగింది. 35 అంశాలపై నిర్ణయం తీసుకున్నారు. కేబినెట్ తీర్మానాలను శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కె పాటిల్ మీడియాకు వెల్లడించారు. కొవిడ్‌వేళ వైద్య ఆరోగ్యశాఖ ద్వారా వందల కోట్ల రూపాయల ఖర్చులకు సమగ్రత లేదన్నారు. ఇదే విషయమై జస్టిస్ మైఖేల్ డి కున్హా ఇటీవల సమర్పించిన నివేదికపైనా చర్చించామన్నారు. అందుకే చీఫ్ సెక్రటరీతోపాటు ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ ద్వారా విచారణకు ఆదేశించామన్నారు.

భద్రావతి స్టీల్ ప్లాంట్‌కు రూ.15వేల కోట్లు

- పునఃప్రారంభంతో వేలాది మందికి ఉపాధి
- కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి



బెంగళూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): శివమొగ్గ జిల్లా భద్రావతిలోని విశ్వేశ్వరయ్య ఐరన్ అండ్ స్టీల్ ఫ్యాక్టరీ (వీఐఎస్ఎల్) పునరుజ్జీవనానికి 15వేల కోట్ల రూపాయలు అవసరమని కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి తెలిపారు. గురువారం శివమొగ్గలో కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం దృష్ట్యా విశ్వేశ్వరయ్య పేరు కాపాడేందుకు ఫ్యాక్టరీని పునఃప్రారంభించేందుకు ప్రామాణికంగా ప్రయత్నిస్తానన్నారు. గతంలో ఈ పరిశ్రమను మూసివేయాలన్న తీర్మానం జరిగిందన్నారు. ఇది వేలాది కుటుంబాలకు జీవనం ఇచ్చిన సంస్థ అన్నారు. దాన్ని కాపాడేందుకు ఎంతగా పోరాటం చేశాననేది తనకు తెలుసునన్నారు. పరిశ్రమకు పూర్వవైభవం తీసుకొస్తానన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కంపెనీలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలనే తీర్మానం జరిగిందన్నారు. పెట్టుబడులు సాధించాలనే నిర్ణయం తీసుకున్నామన్నారు. అయితే వీఐఎస్ఎల్ మనుగడకోసం ప్రయత్నాలు చేస్తానన్నారు. విశాఖపట్నంలోని జాతీయ ఇస్పాత్ లిమిటెడ్ పరిశ్రమకు, వీఐఎస్ఎల్ భిన్నం కాదన్నారు. లాభాల్లో ఉన్న ఆ పరిశ్రమ ప్రస్తుతం నష్టాల్లో ఉందన్నారు. ఆ పరిశ్రమ ప్రారంభం కావాలంటే రూ.35వేల కోట్లు కావాలని, వీఐఎస్ఎల్ మనుగడకు రూ.15వేల కోట్లు అవసరమన్నారు. భారీ పరిశ్రమలశాఖకు అనుకున్నంత స్థాయిలో గ్రాంట్లు కేటాయించే పరిస్థితి లేదన్నారు. ప్రాజెక్టులు ఏవైనా కేబినెట్‌లో చర్చించి ఆర్థికశాఖకు సిఫారసు చేయాల్సి ఉంటుందన్నారు. పూర్తిగా పరిశ్రమను నిర్మించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో సీఎం మార్పుపై ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌లో ఇదేం కొత్త కాదని, రేసులోనూ ఎక్కువ పేర్లు వినిపిస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంపై 40శాతం కమీషన్ ఆరోపణలు చేశారని ఇప్పుడు అంతకంటే ఎక్కువే సాగుతోందని, కాంగ్రెస్ వారే ఆరోపిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే శారదాపూర్యానాయక్, మాజీ ఎమ్మెల్యే కేబీ ప్రసన్నకుమార్, జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు కడిదాళ్ గోపాల్‌తోపాటు పలువురు ఉన్నారు.



సందడే..

- జోరందుకున్న విగ్రహాల కొనుగోళ్లు
- నేడు గౌరీవత్రం..రేపు వినాయకచవితి
- కొలువుదీరనున్న భారీ గణేశ్ విగ్రహాలు
- పలుచోట్ల ఉచితంగా మట్టిగణపతుల పంపిణీ
- ఆకాశాన్నంటిన పూలధరలు





సందడి





సందడిగా కేఆర్ మార్కెట్

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పండగ సందడి నెలకొంది. గౌరివ్రతం, చవితి వేడుకలకోసం ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. శుక్రవారం గౌరివ్రతం ఆచరించేవారు అమ్మవారి విగ్రహాలను సిద్ధం చేసుకుంటున్నారు. శనివారం వినాయక చవితి వేడుకలకోసం గణేశ విగ్రహాల కొనుగోళ్లు జోరందుకున్నాయి. బెంగళూరులో వందలాది ప్రాంతాల్లో వినాయక విగ్రహాల విక్రయాలు సాగుతున్నాయి. చిన్నపాటి విగ్రహాలు ప్రతిచోటా అమ్ముతున్నారు. పెద్ద విగ్రహాలు మాత్రం నగరంలోని ఆర్‌వీ రోడ్డు, మావళ్ళి రోడ్డు, సుంకదకట్టె, మడివాళ, కెఆర్ పురం, వైట్‌ఫీల్డ్, జయనగర్, మల్లేశ్వరం, యలహంక, మైసూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో విగ్రహాలను సిద్ధం చేశారు. పలు ప్రాంతాల్లో కుటుంబ సమేతంగా వచ్చి విగ్రహాలు కొనుగోలు చేస్తున్నారు. నగర వ్యాప్తంగా పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. లాల్‌బాగ్ వెస్ట్‌గేట్ వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం వందలాదిమందికి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.



గౌరి, గణేశ్ విగ్రహాలు తీసుకెళ్తున్న చిన్నారులు

పూలు, పండ్ల ధరలు ఆకాశానికి

వినాయక చవితితోపాటు గౌరివ్రతం కోసం అవసరమైన పూలు, పండ్లు, కూరగాయల ధరలు ఒక్కసారిగా ఆకాశానికి చేరాయి. పండుగను పురస్కరించుకుని ప్రతి వస్తువుధర పెరిగింది. పూల విషయానికి వస్తే కనకాంబరాలు కిలో రూ.3వేలు, మల్లె కిలో 600-800, గులాబి రూ.250, చామంతి కిలో 180-200, చెండుమల్లె రూ.100-150, సుగంధరాజా రూ.240 వీటితోపాటు పలు రకాల పూలధరలు పెరిగాయి. పండ్లు జామ రూ.200, దానిమ్మ రూ.250, ఆపిల్ రూ.300, సీతాఫలం రూ.100, ఏలక్కి అరటిపండ్లు రూ.150, సాధారణ అరటి పండ్లు రూ.60 - 100, ద్రాక్ష కిలో రూ.200, అనారస్ కాయ రూ.50గా విక్రయిస్తున్నారు. పండుగకోసం అవసరమైన అరటిపిలకలు జత రూ.60, మామిడాకుల తోరణం రూ.20-30, గరిక, బిల్వపత్రితోపాటు పలు పత్రులు ధరలు పెరిగాయి. ఇక కూరగాయల ధరలు నాలుగైదు రోజులతో పోలిస్తే కిలోకు రూ.20-30 చొప్పున ధర పెరిగింది.



విగ్రహాలు కొనుగోలు చేస్తూ..



గౌరి విగ్రహంతో మహిళ

వినాయక చవితికి కేఎస్ ఆర్టీసీ 1500 బస్సులు

వినాయక చవితి పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం కేఎస్ఆర్టీసీ అదనంగా 1500 బస్సులను నడుపుతోంది. మెజస్టిక్ నుంచి తిరుపతి, విజయవాడ, హాసన్, మంగళూరు, శృంగేరి, ధర్మస్థళ, దావణగెరె, కుక్కె సుబ్రమణ్యా, శివమొగ్గ, హొరనాడు, విజయపుర, కారవార, కలబురగి, రాయచూరు, బళ్ళారి, బీదర్, హుబ్బళ్ళి-ధారవాడ, బెళగావితోపాటు హైదరాబాద్‌లకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు అధికారులు ప్రకటించారు. మైసూరు రోడ్డు శాటిలైట్ బస్టాండ్ నుంచి మైసూరు, మండ్య, మడికేరి, చామరాజనగర జిల్లాలకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. సింగిల్ బుకింగ్‌లో 4కంటే ఎక్కువ టిక్కెట్లు కొంటే 5శాతం రాయితీ , రిటర్న్ టిక్కెట్ కూడా కొనుగోలు చేస్తే 10శాతం రాయితీ వర్తిస్తుందన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల ప్రదానంలో సీఎం తదితరులు

వారే దేశనిర్మాతలు..

- రైతు, ఉపాధ్యాయుడు, సైనికుల కృషితోనే యువత భవిష్యత్తు
- ఉపాధ్యాయుల దినోత్సవంలో సీఎం

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతు, ఉపాధ్యాయుడు, సైనికుడు దేశనిర్మాతలని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. విజ్ఞానాన్ని చదివి కర్మసిద్ధాంతాన్ని నమ్మి మూఢనమ్మకాలవైపు వెళ్తే అటువంటి విద్య వృథా కానుందని సీఎం విచారం వ్యక్తం చేశారు. ప్రాథమిక, ఉన్నత విద్యాశాఖలు సంయుక్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని విధానసౌధ బ్యాంకెట్‌హాల్‌లో గురువారం నిర్వహించాయి. ముఖ్యులుగా పాల్గొన్న సీఎం మాట్లాడుతూ దేశంలో అత్యున్నతమైన పదవిని అలంకరించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలతో ఉత్తమ ఉపాధ్యాయులు కావాలని పిలుపునిచ్చారు. అప్పుడే గురువులకు గౌరవం మరింత పెరగనుందన్నారు. ప్రతి విద్యార్థి వ్యక్తిత్వాన్ని రూపొందించడం ద్వారా దేశ వ్యక్తిత్వానికి మార్గదర్శకం ఉపాధ్యాయులతోనే సాధ్యమన్నారు. ఆకస్మికంగా ఉపాధ్యాయ వృత్తికి వచ్చినవారి కంటే బోధించాలనే ఆశయం కల్గినవారే ఎక్కువమంది అని భావిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు స్వతంత్రంగా ఆలోచించేలా రూపొందించడం ఉపాధ్యాయుల బాధ్యత అన్నారు. శాస్త్రీయ విధానాలను విద్యార్థులలో పెంపొందింపచేసి సమాజాన్ని అర్థవంతం చేయాలని, సమస్యల పరిష్కారానికి రూపకర్తలుగా తీర్చాలన్నారు. సైన్స్ చదివినవారు మూఢనమ్మకాలు నమ్మి కులాల తారతమ్యం చూపితే వారి చదువుకు అర్థం లేదన్నారు. అందరికీ విద్య అడ్డుకునేలా కాలంపోయిందన్నారు. మనిషి తోటివారిని అభిమానించే మానవత్వపు విధానాన్ని విద్యార్థిదశనుంచే పెంపొందింపచేయడం ఉపాధ్యాయులతోనే సాధ్యమన్నారు. 800ఏళ్లకిందటే కర్మసిద్ధాంతాన్ని బసవణ్ణ తిరస్కరించారన్నారు. ఇప్పటికీ ఉపాధ్యాయులు కొందరు విశ్వసిస్తారన్నారు. ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఇదే సందర్భంగా సత్కరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు భాగస్వామ్యులయ్యారు.

ఘోరం..



- రాయచూరు జిల్లా కపగల్ వద్ద రోడ్డు ప్రమాదం
- ఆర్టీసీ, పాఠశాల బస్సుల ఢీ
- ఇద్దరు విద్యార్థుల దుర్మరణం
- 18 మందికి తీవ్ర గాయాలు
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన మాన్వి ఎమ్మెల్యే, డీసీ



సమర్థ (ఫైల్)



శ్రీకాంత్ (ఫైల్)

రాయచూరు సెప్టెంబర్ 5 : బడి బస్సు ప్రాణం తీసింది. విద్యార్థుల కుటుంబాల్లో విషాదం నింపింది. రాయచూరు జిల్లా మాన్వి తాలూకా కపగల్ వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, ప్రైవేటు పాఠశాల బస్సులు ఢీ కొట్టుకోవడంతో ప్రమాదంలో ముగ్గురు విద్యార్థుల కాళ్లు తెగిపోయాయి. కుర్డి గ్రామానికి చెందిన ఒకటవ తరగతి చదువుతున్న సమర్థ(7), ఏడవ తరగతి చదువుతున్న మరో విద్యార్థి శ్రీకాంత్(12) ఇద్దరూ మృత్యువాతపడ్డారు. రోజూ తరహాలోనే కుర్డి నుంచి మాన్వికి వెళుతున్న ఒక ప్రైవేటు పాఠశాల బస్సును ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ క్రమంలో బస్సులో దాదాపు 32 మంది విద్యార్థులుండగా ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో 18 మందికి తీవ్ర గాయాలు కావడంతో వారిని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి, మరో 14 మంది విద్యార్థులకు రాయచూరు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించి చికిత్సనందిస్తున్నారు.

ప్రమాదం వార్త తెలిసిన వెంటనే జిల్లాధికారి నితీశ్ కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదం గురించి ఆరా తీశారు. అనంతరం అక్కడికి చేరుకున్న మాన్వి ఎమ్మెల్యే హంపయ్య నాయక్, విద్యార్థులు కుటుంబాలకు పరమార్శి, క్షతగాత్రులకు సత్వరం చికిత్స అందించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కాగా ప్రమాదం విషయం తెలుసుక్ను విద్యార్థుల తల్లిదండ్రులు మాన్వి పట్టణంలోని లయోలా పాఠశాల వద్దకు చేరుకున్నారు. వందల సంఖ్యలో ఉన్న తల్లిదండ్రులను నియంత్రించడం పోలీసులకు సాధ్యం కాలేదు. పాఠశాల యాజమాన్యం పై పలువురు తల్లిదండ్రులు ఆగ్రహం చేశారు. మరమ్మత్తులు లేకుండా గుంతలు పడి ఉన్న రోడ్డు వల్లే ఈ ప్రమాదం జరిగిందని, గుంతలను తప్పించే క్రమంలోనే రెండు బస్సుల డ్రైవర్లు ప్రమాదం భారిన పడ్డారని స్థానికులు వివరిస్తున్నారు. అక్కడికి వచ్చిన జిల్లాధికారిని రోడ్డు మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, జిల్లాధికారిని చుట్టుముట్టిన స్థానికులు రహదారిపైనే బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లాధికారి రోడ్డు మరమ్మత్తులు చేయడంతో పాటు మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులైన విద్యార్థులకు మెరుగైన వైద్య సౌకర్యం అందేలా ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. ప్రమాదానికి సంబంధించిన కారణాలను అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



ఢీకొన్న ఆర్టీసీ, పాఠశాల బస్సులు



గాయపడ్డ చిన్నారులను ఆస్పత్రికి తరలింపు




ఎమ్మెల్యే, డీసీలను ముట్టడించిన తల్లిదండ్రులు

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఉస్తాద్ అలావుద్దీన్ ఖాన్ (వర్ధంతి)




సరోద్ వాద్యకళాకారుడిగా పేరొందిన ఉస్తాద్ అలావుద్దీన్ ఖాన్ 1862 అక్టోబరు 8న అప్పటి బెంగాల్ ప్రెసిడెన్సీలోని బ్రహ్మంబరియా ప్రాంతంలో (ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉంది) జన్మించారు. మల్టి-ఇన్‌స్ట్రుమెంటలిస్ట్‌గాను రాణించారు. 20వ శతాబ్ధంలో శాస్త్రీయ సంగీత ఉపాధ్యాయులలో ఒకరిగా నిలిచారు. ఆధునిక మైహర్ ఘరానాతో ఎన్నో రాగాలను ఆధునీకరించారు. పద్మభూషణ్, పద్మవిభూషణ్ పురస్కారం, సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ గ్రహీత. 110వ యేట 1972 సెప్టెంబరు 6న కన్నుమూశారు.

యశ్ జోహార్ (జయంతి)



బాలీవుడ్ సినీ నిర్మాత, ధర్మా ప్రొడక్షన్స్ సంస్థాపకులు యశ్ జోహార్ 1929 సెప్టెంబరు 6న పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో జన్మించారు. ఫోటోగ్రాఫర్‌గా కెరీర్ ఆరంభించి నిర్మాతగా ఎదిగి ఎన్నో బ్లాక్‌బస్టర్ సినిమాలను రూపొందించారు. సునిల్‌దత్, దేవానంద్ వంటి నటులతో కలసి పనిచేశారు. కుమారుడు కరణ్ జోహార్ దర్శకత్వంతో నిర్మించిన 'కుచ్ కుచ్ హోతా హై' సినిమా ఎంతో పేరు తెచ్చింది. హాలీవుడ్ సినిమాలకు కూడా భాగస్వామ్యం వహించారు. అందులో 'జంగిల్ బుక్' ఒకటి. పలు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, నేషనల్ అవార్డులు అందుకున్నారు. 'ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా'లో సీనియర్‌గా వ్యవహరించారు. 2004 జూన్ 26న కన్నుమూశారు. ఆయన కుమారుడు కరణ్ జోహార్ ప్రస్తుతం ధర్మా ప్రొడక్షన్స్‌ను పర్యవేక్షిస్తున్నారు.

రాకేశ్ రోషన్ (పుట్టినరోజు)



హిందీ సినీరంగంలో పేరొందిన నిర్మాత, దర్శకుడు రాకేశ్ రోషన్ లాల్ నగ్రత్ 1949 సెప్టెంబరు 6న బాంబేలో జన్మించారు. తండ్రి, సంగీత దర్శకుడైన రోషన్‌లాల్ నగ్రత్ స్ఫూర్తితో సినీరంగంలో కొనసాగారు. స్క్రీన్‌రైటర్‌గా, ఎడిటర్‌గా, నటుడిగాను రాణించారు. 80కుపైగా సినిమాలలో నటించారు. పలు సినిమాలకు దర్శకత్వం వహించి కొడుకు హృతిక్ రోషన్‌ను 'కహో నా ప్యార్ హై' తో సినీరంగంలోకి ప్రవేశింపచేశారు. సోదరుడు రాజేశ్ రోషన్ సంగీత దర్శకత్వం వహించారు. సినీ రంగంలో పలు విభాగాలలో పురస్కారాలు అందుకున్నారు.

8న విశ్వమంగళ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కుంభాభిషేకం

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నైమిశారణ్యంగా కూడా పిలవబడే శ్రీరంగపట్నం సమీపంలో కావేరి నదీతీరాన బెళగొళ గ్రామంలో వెలసి శ్రీ విశ్వ మంగళ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈనెల 8న మహా కుంభాభిషేకం జరగనుంది. ఆలయ ప్రాంగణం అనేక విశేషాలతో కూడి ఉందని నిర్వాహకులు తెలిపారు. అకస్మాత్తుగా లభించిన లక్ష్మి నరసింహుని విగ్రహాన్ని అతి సుందరమైన ఆలయంలో ప్రతిష్ఠించారు. 12 సంవత్సరాల మహాయజ్ఞంలో భాగంగా 2022 నుంచి 2034 వరకు మహాయజ్ఞం నిర్వహించదలిచారు. నిత్యయజ్ఞం ఆలయంలో నిర్విరామంగా జరుగుతున్నది. యజ్ఞం నిర్వహించడానికి రుత్విక్కులు కర్ణాటక నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్‌లనుంచి కూడా స్వచ్ఛందంగా తరలిరావడం విశేషమని నిర్వాహకులన్నారు. ఆలయానికి అనుబంధంగా వేద పాఠశాల, గోశాలలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఈ ఆలయంలో 2వేల యజ్ఞ యాగాదులు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. ఆలయం ప్రాంగణంలో 16 అడుగుల హనుమంతుని విగ్రహంతోపాటు 50 పంచలోహ విగ్రహాలను ఏర్పాటు చేశారు. నూతనంగా నిర్మించిన గోపురంలో పలు చోట్ల 74 రూపాలలో నరసింహుడి విగ్రహాలు కొలువు దీర్చారు. 8న ఆదివారం నూతనంగా నిర్మించిన రాజ గోపురం, మహామండపాలకు మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉత్సవంలో పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలని అభిలషించారు.



కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయుడు

వ్యవసాయ కుంటల్లో నిమజ్జనం చేయరాదు



వ్యవసాయ శాఖ అధికారికి వినతిపత్రం అందజేత

బంగారపేట, సెప్టెంబరు 5: వినాయక చవితికి గణపతి విగ్రహాలను వ్యవసాయ కుంటలలో నిమజ్జనం చేయరాదని రైతుసంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు వ్యవసాయ శాఖ సహాయక డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. టమోటా, కోసు పంటలకు రోగ నియంత్రణకు నాణ్యమైన ఔషధాలు ఇవ్వాలని, నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.2 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన వ్యవసాయ కుంటల నిర్వహణ లోపం వల్ల కొన్నిచోట్ల మృత్యుకూపాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కుంటలకు కంచె వేయించేలా జాగృతి పరచడంలో అధికారులు విఫలమయ్యారని రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నారాయణగౌడ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా వ్యవసాయ కుంటలలో నిమజ్జనానికి అవకాశం ఇవ్వరాదని జిల్లా పోలీసుశాఖ చొరవ చూపాలని కోరారు. ఈమేరకు ప్రజలలో జాగృతి కల్పించాలన్నారు. కాగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడులలో నిషేధించిన నకిలీ మందులను సరిహద్దు ప్రాంతాలలోని కొన్ని దుకాణాలలో విక్రయిస్తున్నారని ఇందుకు కొంతమంది అధికారుల ప్రమేయం ఉండడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రముఖుడు మరగల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదేళ్లుగా జిల్లాలో టమోటా, కోసు పంటలను లక్షలాది రూపాయల ఖర్చుతో పండిస్తున్నా పలు కారణాలతో నష్టాలు చవిచూస్తున్న రైతాంగాన్ని ఎందుకు ఆదుకోరన్నారు. నకిలీ ఔషధాలతో నష్టాలే అధికమన్నారు. ఇటువంటి సంస్థలపై చర్యలు తీసుకోవడంలో ఎందుకు వెనుకంజ అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్ళి మంజునాథ, కిరణ్, చాంద్‌పాష, కదరినత్త అప్పోజిరావ్, కామసముద్ర మునికృష్ణ, మునిరాజు, విశ్వ, రామసాగర వేణు, ఫరూక్, విజయ్‌పల్, మునియప్ప, రత్నమ్మ, భాగ్యమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిన్న జాబితాలో ఉత్తముడు... పురస్కారానికి బ్రేక్

▸▸ కుందాపుర ప్రిన్సిపాల్ రామకృష్ణకు అన్యాయం

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుందాపుర ప్రభుత్వ పీయూ కళాశాల ప్రిన్సిపాల్ బి.జి.రామకృష్ణకు ఉత్తమ ఉపాధ్యాయుడిగా జాబితాలో ప్రకటించి అంతలోనే పురస్కారం ఇవ్వకుండా బ్రేక్ పెట్టారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 20మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, 11మంది హైస్కూల్, 8మంది పీయూ కళాశాల అధ్యాపకులతోపాటు ఇరువురు ప్రిన్సిపాల్స్‌కు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది. ప్రిన్సిపాల్స్‌లో కుందాపుర పీయూ కళాశాల బి.జి.రామకృష్ణ, మైసూరు జిల్లా హుణసూరు కళాశాల ప్రిన్సిపాల్ రామేగౌడ ఉన్నారు. బి.జి.రామకృష్ణకు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడం పట్ల సోషల్‌మీడియాలో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కుందాపుర కళాశాలలో హిజాబ్‌తో వచ్చిన విద్యార్థినిని గేటు బయట నిలిపిన ప్రిన్సిపాల్‌కు ఉత్తముడని ఎలా గుర్తిస్తారని ఆరోపణలు వచ్చాయి. సోషల్‌మీడియాలో హల్‌చల్ చేయడంతో రామకృష్ణకు పురస్కారం ఇవ్వకుండా ఆపేశారు. ఇదే విషయమై విద్యా శాఖ మంత్రి మధుబంగారప్ప స్పందిస్తూ పురస్కారాన్ని రద్దు చేయలేదని, గత ప్రభుత్వంలో ఆయన ప్రవర్తన సరిలేదనే ఆరోపణలు వచ్చిన మేరకు పెండింగ్‌లో పెట్టామన్నారు. మరోసారి జిల్లా విద్యాశాఖ కమిటీ పరిశీలన చేసి నివేదిక ఇస్తారన్నారు. ఈ విషయమై రాజకీయం సాగుతోందన్నారు.

ఎంపీ పూజారి అభ్యంతరం

ఉడుపి-చిక్కమగళూరు ఎంపీ కోట శ్రీనివాసపూజారి గురువారం మీడియాతో మాట్లాడుతూ హిజాబ్ విషయంలో ఆయన ఒక అధికారిగా ప్రభుత్వ ఆదేశాలను పాటించారని, అంతకు ముందే హైకోర్టు కూడా ఆదేశాలు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం, కోర్టు ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవడంతో తన విధులను నిర్వర్తించారన్నారు. అయితే ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసిన అనంతరం ప్రభుత్వం ఇవ్వకపోవడం సముచితం కాదని ఆక్రోశం వ్యక్తం చేశారు.

ఆసుపత్రులు సేవాభావంతో పనిచేయాలి

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సేవాభావంతో ఆసుపత్రులు పనిచేయాలని ఆధునిక సాంకేతిక యంత్రాలను ఉపయోగించడం ద్వారా సమాజంలో మెరుగైన ఆరోగ్యాన్ని అందించాలని ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు పేర్కొన్నారు. నగరంలోని వాసవి ఆసుపత్రిలో 3-టెస్లా ఎంఆర్ఐ, 128 స్లైస్ సిటిస్కానర్ యంత్రాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసుపత్రులు ఆదాయం కంటే సేవాభావానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలకు మాకో రోబోటిక్ యంత్రాన్ని కరూర్ వైశ్యాబ్యాంక్ ఎండీ సీఈఓ రమేశ్‌బాబు ప్రారంభించారు. ఎమ్మెల్సీ గోవిందరాజు, ఆసుపత్రి అధ్యక్షుడు సుబ్రమణ్యగుప్త, ఛైర్మన్ శ్రీనివాసగుప్త, వైస్‌ఛైర్మన్ సుబ్బరాజుతోపాటు దాతలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఆధునిక సేవలను ప్రారంభిస్తున్న మంత్రి దినేశ్‌గుండూరావు



రిటైర్డు టీచర్‌కు సన్మానం

రిటైర్డు ఉపాధ్యాయులకు నేషనల్ సంస్థ సత్కారం

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆఫ్ కర్ణాటక రిటైర్డు ఉపాధ్యాయులను సత్కరించింది. నగరంలోని బసవనగుడిలో గురువారం ఏర్పాటైన కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులను ఉద్దేశించి సంస్థ అధ్యక్షుడు సుబ్రమణ్య మాట్లాడుతూ ఒకసారి ఉపాధ్యాయుడైతే జీవితకాలం అదేవృత్తిలో కొనసాగుతారన్నారు. సమాజానికి ఉపాధ్యాయుడు మార్గదర్శకులన్నారు. ఉపాధ్యక్షుడు వెంకటశివారెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఉపాధ్యాయుల సేవలు అనన్యమైనవన్నారు. సమాజంలో నిన్నటి, నేటి తరం జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేందుకు ఉపాధ్యాయులే కారకులన్నారు. రిటైర్డు అధ్యాపకులు అనంతరంగన్ డాక్టర్ శైరిన్ నేదుంగడి, అరుణాచలం, డాక్టర్ హెచ్‌జి గోకుల్, సోనార్ మారుతి జయ రామప్ప, డివి నాగేశ్, ఎస్ఆర్ పంకజ, ఎజి నాగరాజయ్యలను సత్కరించారు.

మట్టిగణపతులకు ప్రాధాన్యం

దొమ్మసంద్ర, సెప్టెంబరు 5: వినాయక చవితి పండుగను పర్యావరణ హితంగా ఆచరించేందుకు మట్టిగణపతులను కొలువుదీర్చాలని, జలవనరులను కాపాడాలని స్వచ్ఛంద సంస్థలు పిలుపునిచ్చాయి. సుభాష్ సేవా సంస్థ, కళాశాల, పాఠశాల పిల్లల ద్వారా పాఠశాలలో ఏర్పాటైన కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, సామాజిక కార్యకర్త అనురాధ మాట్లాడుతూ ప్రకృతి వనరులైన నీటిని కాపాడుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. రసాయలతో కూడిన విగ్రహాల నిమజ్జనంతో కలుషితం అవుతాయని అందుకు అవకాశం ఇవ్వరాదన్నారు. పిల్లలు కూడా మట్టి గణపతులు తయారీలో ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. రాగినాడు లయన్స్‌క్లబ్ ప్రముఖుడు చామరాజ్, అంగన్‌వాడీ కార్యకర్త రూపా, అభ్యుదయ సేవా సంస్థ కుసుమా, పత్రికా, మాలిని, కావ్యా, వీణా, న్యాయవాది పురుషోత్తమ చిక్కహొగడె తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో వినూత్నంగా జాగృతి ఇలా..



విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఎంపిక పత్రాలు అందజేత

29మంది స్కాలర్‌షిప్‌లకు ఎంపిక

బాగేపల్లి, సెప్టెంబరు 5: పట్టణంలోని ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సుజ్ఞాననిధి పేరిట స్కాలర్‌షిప్‌లకు 29మందిని ఎంపిక చేసింది. గురువారం ఏర్పాటైన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఎంపిక పత్రాలను అందచేసింది. దివ్యాంగులకు వీల్‌చెయిర్, ఆరోగ్య రక్షక సహాయధనం, వివిధ సౌలభ్యాల పంపిణీను సంస్థ జిల్లా డైరెక్టర్ ప్రశాంత్ ప్రారంభించి మాట్లాడారు. సుజ్ఞాననిధి కింద 29మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు నరసింహనాయుడు, బిళ్ళూరు ఆంజనేయస్వామి ట్రస్టు అధ్యక్షుడు నాగరాజు, బిఆర్‌పి పద్మావతి, ఏఎస్సై నారాయణస్వామి, మేనేజర్ సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు సర్వేపల్లి

మహదేవపుర, సెప్టెంబరు 5: భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శాలు అనుసరణీయమని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హూడి మంజునాథ్ అభిప్రాయపడ్డారు. హూడి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో గురువారం ఏర్పాటైన ఉపాధ్యాయ దినోత్సవంలో డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. సర్వేపల్లి జీవనం, పోరాటం, సాధనలను భావితరాలకు తెలియచేయాలన్నారు. ఉపాధ్యాయుడిగా, రాష్ట్రపతిగా సర్వేపల్లి సేవలు అనన్యమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేశవరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ రమేశ్, టీచర్ చన్నకృష్ణప్ప, స్థానిక ప్రముఖుడు లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సన్మానం

మార్కెట్‌లోకి ఇన్సులేటెడ్ ఫైర్‌డోర్

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఫైర్ డోర్‌ల తయారీలో దేశంలోనే పేరొందిన టఫ్‌వుడ్ సంస్థ ఐఎస్ఐ గుర్తింపుతో ప్రత్యేక డోర్‌ను విడుదల చేసింది. ఇటీవల ముంబై జియో కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఫైర్ అండ్ సెక్యూరిటీ ఇండియా ఎక్స్‌పోలో డోర్‌ను విడు దల చేసినట్టు సంస్థ డైరెక్టర్ ప్రవీణ్ ఖేమ్కా తెలిపారు. ఈమేరకు బెంగళూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భద్రతతో ఇన్సులేటెడ్ ఫైర్‌డోర్‌ను పరిచయం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎఫ్‌డి 120 ఐడి విధానాలతో నిర్మించామన్నారు. నివాసం, కార్యాలయం ఏదైనా డోర్‌లు భద్రతగా ఉండాలనేది మా ఆశయమన్నారు. అందుకు అనుగుణంగానే నాణ్యత పాటించామన్నారు.

36మంది వెట్టిచాకిరీ కార్మికులకు విముక్తి



రక్షించిన కార్మికులను వ్యాన్‌లో తరలిస్తున్న దృశ్యం

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుమకూరు జిల్లా తిపటూరు తాలూకా హాల్కురికె, మంజునాథపుర గ్రామాల పరిధిలో అల్లం సాగు భూములలో వెట్టి చాకిరీ తరహాలో పనిచేస్తున్న 36మంది కార్మికులను పోలీసులు రక్షించారు. ఈ ప్రాంతంలో కొందరు పలుకుబడి కల్గినవారు రైతులనుంచి భూమిని లీజుకు తీసుకుని అల్లం సాగు చేస్తారు. కూలి పనులకోసం మైసూరు, చామరాజనగర, కొళ్ళేగాల, బళ్ళారి విజయపుర జిల్లాలలోని మారుమూల గ్రామాలకు చెందిన వారికి నిరంతరంగా పని కల్పిస్తామని నమ్మించి కనీస సదుపాయాలు లేకుండా వెట్టి చాకిరీ తరహాలో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానికుల సమాచారంతో బుధవారం రాత్రి పోలీసులు రంగంలో దిగగా పలు విస్మయం కలిగించే అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఆధార్, ఇతర గుర్తింపుకార్డులు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని ఓ షెడ్‌లో బంధించారన్నారు. ఉదయం 6 గంటలనుంచి రాత్రి 8 గంటల దాకా పని చేయిస్తారని ఆరోపించారు. కనీస సదుపాయాలు ఇవ్వరని నెలల కాలంగా కూలి సొమ్ము ఇవ్వడం లేదన్నారు. ఇక్కడనుంచి వెళ్లిపోతామని చెప్పినా, ఆరోగ్యం బాగా లేదన్నా, ఇంత సమయం పని చేయలేమని అభ్యంతరం చెప్పినా చితకబాదుతారని ఆరోపించారు. స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు 36మంది కార్మికులను రక్షించారు. వారిని హొన్నవళ్ళి సముదాయ భవనానికి తరలించి ఆశ్రయం కల్పించారు.

ఏపీ సీఎం సహాయనిధికి రూ.లక్ష విరాళం



లక్ష రూపాయల చెక్కుతో లక్ష్మిరెడ్డి దంపతులు

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన ప్రాంతాలలో ప్రజల అత్యవసర సాయం కోసం బెంగళూరు నివాసి, విజన్ విద్యాసంస్థల అధినేత ఇడమకంటి లక్ష్మిరెడ్డి లక్ష రూపాయల సాయం ప్రకటించారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ సీఎం సహాయనిధికి లక్ష రూపాయలు అందచేయదలిచినట్టు వెల్లడించారు. రెండు రోజుల్లో సీఎంకు చెక్కును అందచేస్తామన్నారు.

క్రిప్టో పెట్టుబడులలో మోసాలపై ముడ్రెక్స్ సాధన

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో పెట్టుబడుల ద్వారా మోసాలకు పాల్పడుతున్న వెబ్‌సైట్‌ల నుంచి ముడ్రెక్స్ సంస్థ న్యాయపోరాటంలో విజయం సాధించిందని సంబంధిత సంస్థ ప్రతినిధులు బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. ముడ్రెక్స్ కో-ఫౌండర్ ఎడుల్ పటేల్ అభిప్రాయం ప్రకారం క్రిప్టో పెట్టుబడులలో ప్రజలను మోసం చేసే వెబ్‌సైట్‌లపై ముడ్రెక్స్ సంస్థ నిరంతరంగా పోరాటం చేసినట్లు పేర్కొన్నారు 38 వెబ్‌సైట్‌లపై చర్యలకు అనుకూలం కావడం ద్వారా ఎంతోమంది పెట్టుబడుదారులను మోసం చేసే ప్రయత్నాలను కట్టడి చేశామన్నారు. ముడ్రెక్స్ సంస్థ పేరును వాడుకుని ప్రజల నుంచి పెట్టుబడులు పొందుతున్నారనే ఆరోపణల మేరకు స్పందించినట్లు పేర్కొన్నారు. ముడ్రెక్స్ సంస్థ పెట్టుబడుదారుల నమ్మకం, విశ్వాసానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించి నిరంతరంగా న్యాయపోరాటం చేసి 38 వెబ్‌లపై చర్యలు తీసుకునేలా సాధించిమన్నారు. పెట్టుబడి దారుల విశ్వాసం కల్పించేందుకు కట్టుబడుతామని ప్రకటనలో పేర్కొన్నారు.

టిప్పర్ దూసుకెళ్లి ఇద్దరి మృతి



హోటల్ గోడను ఢీ కొన్న టిప్పర్ లారీ ఇలా...

చింతామణి, సెప్టెంబరు 5: పట్టణంలోని కోలారు సర్కిల్‌లో కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్‌లారీ అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న హోటల్‌లోకి దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా ఒకరు గాయపడిన సంఘటన గురువారం ఉదయం 9 గంటలకు చోటు చేసుకుంది. ఘటనలో హోటల్‌లోని వినియోగదారులు, ఇతర సిబ్బంది ప్రమాదం నుంచి బయటపడ్డారు. టిప్పర్ లారీ ఢీ కొన్న ధాటికి హోటల్‌భవనం పూర్తిగా దెబ్బతింది. టిప్పర్ లారీ బోల్తా పడింది. చింతామణి పట్టణం నుంచి కోలారువైపు కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఒక్కసారిగా దర్శిని ఫాస్ట్‌ఫుడ్ హోటల్ గోడను ఢీ కొన్నాడు. క్యాష్‌కౌంటర్‌లో కూర్చున్న యజమాని, కూరగాయలు తరుగుతున్న వ్యక్తిని ఢీ కొన్న లారీ పక్కకి ఒరిగిపోయింది. ప్రమాదంలో హోటల్ యజమాని, మాడికెరె గ్రామానికి చెందిన శివానంద (60) ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. వంట చేస్తున్న 50ఏళ్ల కుమార్‌కు తలకు తీవ్రగాయాలు కావడంతో అతడిని కోలారు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ఇక వినాయకనగర్‌కు చెందిన 50ఏళ్ల శ్రీనివాసబాబు కాలికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టిప్పర్ లారీ బోల్తాపడడంతో అందులోని కంకరకింద పడి వాహనాలు, కొంతమంది వ్యక్తులు చిక్కుకుని ఉండవచ్చునని స్థానికులు వెంటనే సహాయక చర్యల్లో పాల్గొన్నారు. నగరసభ డోజర్, నగరసభ పొక్లైనర్, ప్రైవేట్ జేసీబీ, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని కంకర తొలగించగా ఒక ద్విచక్రవాహనం మాత్రమే ఉన్నట్టు గుర్తించారు. కంకరకింద ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. కాగా ప్రమాదానికి కారణమైన టిప్పర్‌లారీ డ్రైవర్ వెంటనే అక్కడనుంచి పరారయ్యాడు. పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్, వాహన యజమానికోసం గాలింపులు చేపట్టారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సైలు షాబుద్దీన్, ప్రకాశ్, నారాయణస్వామి, ఇన్‌చార్జ్ సిఐ అయిన రూరల్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శివరాజ్, చిక్కబళ్ళాపుర అడిషినల్ ఎస్పీ రజా ఇమామ్ ఖాసిమ్, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి బసవరాజ్, తాలూకా అగ్నిమాపకశాఖ అధికారి లోకేశ్ తదితరులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

యువతి హత్యకేసులో ముగ్గురి అరెస్టు


బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీదర్ యువతి హత్య కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. బీదర్ జిల్లా బసవకల్యాణ తాలూకా గుణతీర్థవాడి గ్రామానికి చెందిన భాగ్యశ్రీ ఆగస్టు 29న ఇంటినుంచి బయటకు వెళ్లిన తర్వాత కనిపించకుండా పోయారు. కుటుంబ సభ్యులు, బంధువులు పలుచోట్ల గాలింపులు జరిపారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో బసవకల్యాణ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆగస్టు 31న యువతి మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సెప్టెంబరు 1న గుణతీర్థవాడి గ్రామ శివారులో మృతదేహం లభించింది. భీకరంగా హత్యచేసినట్టు గుర్తించారు. పాఠశాల సమీపంలోని ముళ్లపొదలలో మృతదేహం కుళ్లిన స్థితిలో గుర్తించారు. వస్త్రాలు లేకుండా ఉండడంతో అత్యాచారం చేసి ఆపై హతమార్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. అదనపు ఎస్పీ మహేశ్ మేఘణ్ణనవర్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. యువతిని కిరాతకంగా హత్య చేసినవారిని హతమార్చాలంటూ స్థానికులు నిరసన చేపట్టారు. కాగా గురువారం ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్టు పోలీసులు ప్రకటించారు. తొలుత యువతిపై అత్యాచారం చేసి ఆపై హతమార్చి ఉంటారని భావిస్తున్నారు. హత్యలో ప్రధాన సూత్రధారి అదే గ్రామానికి చెందినవాడు కాగా మిగిలిన ఇద్దరూ అతడి స్నేహితులుగా గుర్తించారు. అట్రాసిటీతోపాటు అత్యా చారం, హత్య కేసులను నమోదు చేసినట్టు వెల్లడించారు.

నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలు జేడీఎస్ కైవశం



ఫలితాల అనంతరం మీడియాతో ఎమ్మెల్యే రవికుమార్ తదితరులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 5: నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానానికి రెండో అవధికి గురువారం ఎన్నికలు నిర్వహించగా జేడీఎస్ వశమయ్యాయి. జేడీఎస్ మద్దతు దారుడు వెంకటస్వామి 21 ఓట్లతో గెలుపొందగా ఎమ్మెల్యే బిఎన్ రవికుమార్, కోలారు ఎంపీ మల్లేశ్‌బాబు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నగరసభలో 31 మంది సభ్యులకుగాను ఇద్దరు గైర్హాజరు కాగా 29మంది హాజరయ్యారు. ఎంపీ, ఎమ్మెల్యేలు ఓటింగ్‌లో పాల్గొన డంతో 31 ఓట్లు పోలయ్యాయి. జేడీఎస్‌కు మద్దతుగా 21, కాంగ్రెస్‌కు మద్దతుగా 10 ఓట్లు వచ్చాయి. మొత్తమ్మీద కొన్ని రోజులుగా ఉన్న ఉత్కంఠకు తెరపడింది. జేడీఎస్ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.92	1,624.16
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	39,945	559
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	15,235	8,737
సామర్థ్యం (టీఎంసీలు)	101.46	73.78

హెచ్ఐవీపై అవగాహన ముఖ్యం



కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మేయర్ నందీశ్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 5: హెచ్ఐవీ మహమ్మారిని తరిమికొట్టేందుకు టీనేజర్లు వాటిపై అవగాహన పెంచుకోవాలని మేయర్ నందీశ్ అన్నారు. బళ్లారిలోని యువతకు హెచ్ఐవీ-ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు రాష్ట్రస్థాయి ఎయిడ్స్ నివారణ సంఘం, విజయనగరం జిల్లా గ్రాడ్యుయేట్ కళాశాలల విద్యార్థులు గురువారం నగరంలోని జిల్లా స్టేడియంలో నిర్వహించిన ప్రో- కబడ్డీ టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీనేజర్లలో హెచ్ఐవీ కేసులు ఎక్కువగా ఉన్నాయన్న నివేదిక ఆందోళన కలిగిస్తోందని, అందరూ లైంగిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాఆరోగ్య కుటుంబ శాఖ అధికారి రమేశ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో మొత్తం మీద యువకుల్లో హెచ్ఐవీ కేసులు పెరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు , బస్‌స్టేషన్ ,మార్కెట్, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో కళాబృందాలతో అవగాహన కల్పించాలన్నారు. వివాహానికి ముందు బ్రహ్మచర్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఇంద్రాణి మాట్లాడుతూ ఇన్‌ఫెక్షన్ సమస్యలపై అవగాహనను పెంపొందించుకోవడంతో పాటు ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలపై ప్రతి ఒక్కరి దృష్టిని మళ్లించడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సుకుమ్, నాయకులు నాగ లకెరీ గోవింద్, ఫయాజ్, జిల్లాఎయిడ్స్ సూపర్‌వైజర్ గిరీశ్, జిల్లాఆరోగ్య విద్యాశాఖాదికారి ఈశ్వర్‌దాసప్పనవర్ పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



జ్యోతి వెలిగిస్తున్న తహసీల్దార్ చిత్తయ్యపూజార్

పావగడ, సెప్టెంబరు 5: దేశ మొదటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధకృష్ణన్ జయంతినిప ఉరస్కరించుకుని ఉపాధ్యాయల దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో గర్వకారణమని బెంగళూరు యూనివర్సిటీ కన్నడ ప్రొఫెసర్ చిత్తయ్య పూజా తెలియజేశారు. గురువారం ఎస్ఎస్‌కె సముదాయ భవన్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా తహసీల్దర్ వరదరాజు, మునిసిపల్ అధ్యక్షుడు రాజేష్ తదితరులు కలిసి జ్యోతి వెలిగించి మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండే సంతృప్తి సంతోషం, ఆత్మవిశ్వాసం ఏ ఉద్యోగంలోనూ లేదని అందుకే రాధకృష్ణన్, అబ్దుల్ కలాం కూడా రాష్ట్రపతి అయినా కూడా ఉపాధ్యాయ వృత్తికి ఎంతో వెలుగునిచ్చేవారన్నారు. అనంతరం రాధకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులు అర్పించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ధర్నా శిబిరాన్ని సందర్శించిన తహసీల్దార్

పావగడ, సెప్టెంబరు 5: పావగడ సోలార్‌పార్క్‌లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలనే డిమాండ్‌తో గత 15రోజుల నుంచి బీఎస్పీ ఆధ్వర్యంలో నడుస్తున్న ధర్నా శిబిరాన్ని గురువారం తహసీల్దార్ సందర్శించారు. అక్కడ నాయకులతో మాట్లాడుతూ, సోలార్ పార్కులకు భూములు ఇచ్చిన రైతు కుటుంబాలతో పాటు స్థానికులకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. దీంతో బీఎస్పీ తాలూకా అధ్యక్షుడు హనుమంతరాయ, ఇతర సభ్యులు ధర్నా విరమించారు. 5వేల ఉద్యోగాలు స్థానికులకు కల్పించాలని ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన తహసీల్దార్‌ను కోరారు. ఈ సందర్భంగా ఈఓ జానకిరామ్, నరసింహమూర్తి, కృష్ణమూర్తి, రామప్ప, తదితరులు కలిసి వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేసి ధర్నా విరమించుకుంటునట్లు తెలిపారు.

గురువుల పాత్ర వెలకట్టలేనిది

●ఉపాధ్యాయ దినోత్సవంలో సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి



జ్యోతివెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సిటీ ఎమ్మెల్యే

బళ్లారి సిటీ, సెప్టెంబరు 5: భావిదేశాన్ని నిర్మించి పిల్లలను మంచి మార్గంలో నడిపించడంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేదని బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి అన్నారు. డాక్టర్ సర్వేపల్లి 136వ జయంతి సందర్భంగా స్టేడియం రోడ్డులోని మహర్షి వాల్మీకి కమ్యూనిటీ భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాలుగు గోడలమధ్య పిల్లల చదువులతోనే దేశభవిష్యత్తు వికసిస్తుందని, దేశాభివృద్ధి ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, వారి ప్రేరణతోనే మనిషి ఉన్నతస్థితికి ఎదగగలడన్నారు. జిల్లాలో గురుభవన్ నిర్మాణానికి సంబంధించి జిల్లా కలెక్టర్‌తో చర్చిస్తామన్నారు. జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లలను తమ సొంత బిడ్డల్లా చూసుకుని చదివించడం అభినందనీయమన్నారు. ప్రజలను అజ్ఞానం నుంచి విజ్ఞానం వైపు తీసుకెళ్ళేందుకు ఉపాధ్యాయుల కృషి ఎంతో అవసరమన్నారు. పాఠశాల విద్యాశాఖ ఉప సంచాలకులు ఉమాదేవి మాట్లాడుతూ మహనీయుల జన్మదినాలను, విశిష్టంగా జరుపుకుంటున్నారన్నారు. పదవతరగతి పరీక్షల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రస్తుత విద్యాసవాళ్లను ఎదుర్కోవాలంటే పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని, పిల్లలకు నైతిక విలువలు, సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించి వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన 13మంది ఉపాధ్యాయులను, విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. ఈసందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ముల్లంగి నందీశ్, డిప్యూటీ మేయర్ సుకుమ్, రాష్ట్ర హామీ పథకాల అమలు అథారిటీ జిల్లా అధ్యక్షుడు చిదానందప్ప, జిల్లాపంచాయితీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి రాహుల్ శరణప్ప, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివాజీరావు, అన్ని క్షేత్ర విద్యాశాఖాధికారులు , ఫీల్డ్ కోఆర్డినేటరు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నేడు శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ స్నాతకోత్సవం

బళ్లారి సిటీ, సెప్టెంబరు 5: విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ 12వ స్నాతకోత్సవం శుక్రవారం మధ్యాహ్నం జరుగుతుందని ఛాన్సలర్ మునిరాజు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు మహనీయులకు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. యూనివర్శిటీ హాల్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అధ్యక్షత వహిస్తారని, సీనియర్ సైంటిస్ట్, దార్వాడ్ ఐఐటీ డీన్ ప్రొఫెసర్ శివప్రసాద్ కాన్వొకేషన్ ప్రసంగం చేస్తారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛాన్సలర్ మునిరాజు

స్నాతకోత్సవంలో ముగ్గురికి గౌరవ డాక్టరేట్‌లు

ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విజయం సాధించిన ఉమాశ్రీ, ఎస్‌కే. మోదీ, చంద్రమౌళేశ్వర స్వామీజీలను గౌరవ డాక్టరేట్లతో సత్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే విశ్వవిద్యాలయ ఇండస్ట్రీయల్ కెమిస్ట్రీ విభాగం నుంచి ఉమకు, నాగరాజుకు, వాణిజ్య విభాగం నుంచి దౌలత్‌బానుకు బంగారు పతకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయంలో మొత్తం 13,339 అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు తుది పరీక్షకు హాజరయ్యారని, మాస్టర్స్ డిగ్రీకి మొత్తం 1.733 మంది విద్యార్థులు హాజరయ్యారని, వారందరికీ కాన్వొకేషన్ డిగ్రీలు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో వైచాన్సలర్ రుద్రేశ్, ప్రొఫెసర్ రమేశ్ ఓలేకారు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను బోధించాలి



రిటైర్డు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి: ఉత్తమ విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని కంప్లి ఎమ్మెల్యే జే. ఎన్ గణేష్ కోరారు. కంప్లి పట్టణంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, విద్యావంతులను చేయాలన్నారు. అన్ని ఆస్తుల కన్నా విద్య చాలా విలువైనదని పేర్కొన్నారు. కంప్లి, కురుగోడులలో గురు భవనం నిర్మిస్తామని పేర్కొన్నారు. విశ్రాంతి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్‌కుమార్, శిక్షణ అధికారి సిద్ధలింగమూర్తి, ఈవో శ్రీకుమార్, ఏడీ మల్లన్నగౌడ, హనుమంతప్ప, నాగేశ్వరరావు, దొడ్డబసప్ప, నాగన్నగౌడ, బసవరాజ్, సోమశేఖర్, నారాయణప్ప, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలు రెండూ కార్పొరేట్ పార్టీలే



చలో ఢిల్లీ పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐకేకేఎంఎస్ నేతలు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 5: భారతదేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీలు రెండూ కార్పొరేట్ పార్టీలేనని అఖిల భారత రైతు కృషికార్మిక సంఘం(ఏఐకేకేఎంఎస్) రాష్ట్రసమితి సభ్యులు హనుమంతప్ప, జిల్లా కార్యదర్శి గురళ్లి రాజ తెలిపారు. వారు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్ని ప్రభుత్వాలు ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాల వల్ల రైతులకు అందజేసే రాయితీలన్నింటికీ కోత విధించి వాటిని పెట్టుబడిదారులకు బదిలీ చేస్తున్నారన్నారు. రైతులకు తక్కువ ధరలో ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలని, బగర్ హుకుమ్ సాగుదారులకు తక్షణం హక్కు పత్రాలను అందజేయాలన్నారు. రైతు రుణాలను మాఫీ చేయాలని, 60 సంవత్సరాలు పైబడిన వారికి పింఛన్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. వివిధ సమస్యల పరిష్కారానికై సెప్టెంబర్ 23న చలో ఢిల్లీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా కురుగోడు తాలూకా అధ్యక్షుడు లింగప్ప, కార్యదర్శి బసరాజు, జిల్లాసమితి సభ్యులు బెళగల్ బసవరాజ్, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయాలపై నిషేధం: కలెక్టర్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 5: గౌరీ గణేశ్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా గణపతిని నిమజ్జనం చేసే 3,5,11వ రోజుల్లో మద్యం దుకాణాలు, బార్ రెస్టారెంట్లు తెరవరాదని, ఈ రోజుల్లో మద్య నిషేధం విధించినట్లు కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఆదేశాలు జారీ చేశారు.



కిక్కిరిసిన స్టేడియం





యువత.. కేరింత..

బౌలర్లదే హవా

ఇండియా-సి ఇండియా-డి మధ్య పోటీ

దులీప్ ట్రోఫీలో ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్న అక్షర్ పటేల్


అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 5: అనంతపురంలోని ఏసీజీ గ్రౌండ్‌లో గురువారం ప్రారంభమైన దులీప్ ట్రోఫీలో బౌలర్లు సత్తాచాటారు. ఇండియా సీ-ఇండియా డీ జట్ల మధ్య పోటీ సాగింది. ఇండియా సీ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఇండియా డీ జట్టు 164 పరుగులకే కుప్పకూలింది. బౌలర్లు విజయ్‌కుమార్ వైశాక్ 3, అన్షుల్ కాంబోజ్ 3, హిమాన్షు చౌహాన్ 2, మనవ్ సుతార్, హృతిక్‌షోకిన్ చెరో వికెట్ తీశారు. ఓపెనర్లు అథర్వటైడ్(4), యశ్‌దుబే(10) తక్కువ స్కోరుకే ఔటయ్యారు. తరువాత క్రీజ్‌లోకి వచ్చిన రిక్కీబూయ్(4), కేఎస్‌భరత్(13), శ్రేయాస్ అయ్యర్(9), శరాన్ష్‌జైన్(13) తక్కువ స్కోర్‌కే ఔట్‌కాగా దేవదత్ పడిక్కిల్, హర్షిత్‌రాణా డకౌట్ అయ్యారు. అయితే 7వ నెంబర్ బ్యాట్స్‌మన్‌గా బరిలోకి దిగిన అక్షర్‌పటేల్ తొలుత నెమ్మదిగా ఆడినా తరువాత చెలరేగాడు. 118 బంతులను ఎదుర్కొన్న అక్షర్‌పటేల్ 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 86 పరుగుల చేసి జట్టును కీలక సమయంలో ఆదుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇండియా సీ జట్టు 91 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయింది. తొలి రోజు ఆటముగిసే సమయానికి ఇంద్రజిత్ (15), అభిషేక్ పోరెల్ 32 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. జట్టు కెప్టెన్, ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ 5 పరుగులకే ఔటయ్యాడు. సాయిసుదర్శన్ 7 పరుగులు, ఆర్యన్ జుయల్ 12 పరుగులు, రజిత్‌పటిదార్ 13 పరుగులకు పెవిలియన్‌బాట పట్టారు. ఇండియా డీ బౌలర్లలో హర్షిత్‌రాణా, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.

కిక్కిరిసిన స్టేడియం

ఏసీజీ అభిమానులతో కిక్కిరిసింది. భారత జట్టు మేటి ఆటగాళ్లు ట్రోఫీలో ఆడుతుండటంతో చూసేందుకు యువత ఎగబడ్డారు. పోలీసులు గట్టి బందోబస్తు కల్పించారు. పాసులు ఉన్న వారిని మాత్రమే లోనికి అనుమతించారు. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంచోఫెర్రర్, ప్రతినిధి సతీష్, ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు షాబుద్దీన్, పడగాల మల్లికార్జున, ఏజీపీ తీర్థ, సాయికృష్ణ, మచ్చా రామలింగారెడ్డి, పీఎల్ ప్రకాష్ రెడ్డి, మధు ఆచారి, మీడియా కోఆర్డినేటర్ తిమ్మప్ప, ఏసీఏ మీడియా మేనేజర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అర్షదీప్ సింగ్ బౌలింగ్



డ్రింక్స్ బ్రేక్..

హోసూరు జోన్

డీఎంకే 200 సీట్లు గెలవడం ఖాయం: ఎమ్మెల్యే ప్రకాష్



సమావేశంలో పాల్గొన్న డీఎంకే ప్రముఖులు, కార్యకర్తలు

హోసూరు, సెప్టెంబరు 5: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమీ 200 సీట్లు గెలుచుకుంటుందని ఎమ్మెల్యే వై.ప్రకాశ్ అన్నారు. హోసూరు మున్సిపల్ డీఎంకే దక్షిణ ప్రాంత జనరల్ సభ్యుల సమావేశం గురువారం జరిగింది, సమావేశానికి ఏరియా కౌన్సిల్ అధ్యక్షుడు రామచంద్రం అధ్యక్షత వహించారు. డివిజన్ కార్యదర్శి తిమ్మరాజు అందరికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడతూ, జిల్లాలోని హోసూరు తళి , వేపనపల్లి నియోజకవర్గాల్లో డీఎంకే కూటమిని గెలిపిస్తా మన్నారు. ఎన్నికల పనులు ఇప్పుడే ప్రారంభించాలని, సెప్టెంబర్ 15 అన్నా పుట్టినరోజు సందర్భంగా హోసూరు నగరంలోని మొత్తం 45 వార్డుల్లో పార్టీ జెండాను ఎగరవేస్తామన్నారు. సెప్టెంబర్ 17న చెన్నైల్లో జరిగే మూడు ప్రధాన పండుగల్లో అందరూ పాల్గొనాలని కోరారు. కరుణానిధి శత జయంతి స్మారక నాణెం విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి ఎం.కే.స్టాలిన్ కు ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశారు. ఈసమావేశంల్లో మున్సిపల్ నిర్వాహకులు సెందిల్‌కుమార్, గోపాలకృష్ణన్, రవికుమార్, శాంతి, త్యాగరాజ్, ఏరియా కార్యదర్శులు డిప్యూటీ మేయర్ ఆనందయ్య, రాము, వెంకటేష్, జోనల్ కమిటీ చైర్మెన్ రవి, నగర మాజీ కార్యదర్శులు గురుస్వామి, నాగరాజ్, టాక్సేషన్ అండ్ ఫైనాన్స్ కమిటీ చైర్మెన్ చెన్నీరప్ప తదితరులు పాల్గొన్నారు.

100 యూనిట్ల రక్తం సేకరణ

హోసూరు, సెప్టెంబరు 5: జెనీవా కన్వెన్షన్ 75వ వార్షికోత్సవం సందర్భంగా హోసూరు పెరుమాళ్ మణిమేగలై పాలిటెక్నిక్ కళాశాల, యూత్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణగిరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి విద్యాసంస్థల చైర్మెన్ కుమార్ అధ్యక్షత వహించగా, కార్యదర్శి మలర్, ట్రస్టీ శశిరేక, డైరెక్టర్ సుధాకరన్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బాలసుబ్రహ్మణ్యం శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్.కుమార్ సమక్షంలో వందమంది విద్యార్థులచే కృష్ణగిరి ప్రభుత్వ బ్లడ్‌బ్యాంకు వైద్య బృందం 100 యూనిట్ల రక్తాన్ని సేకరించింది. కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల రక్తనిధికి పంపించారు. ఏర్పాట్లను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణగిరి జిల్లా శాఖ కార్యదర్శి సెందిల్ కుమార్ పర్యవేక్షించారు.

సర్వేపల్లికి ఘనంగా నివాళులు

హోసూరు, సెప్టెంబరు 5: భారతరత్న గ్రహీత, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గౌరవార్థం ఏర్పాటుచేసిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కృష్ణగిరి జిల్లా హోసూరు యూనియన్ బేడరపల్లి ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలల్లో రాధాకృష్ణన్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ ఏడాది కొత్తగా నియమితులైన పాఠశాల నిర్వహణ కమిటీ నిర్వాహకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రదానోపాధ్యాయుడు పొన్నాగేశ్‌తో పాటు ఉపాధ్యాయులందరినీ ఘనంగా సత్కరించి స్వీట్లు పంచిపెట్టారు, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షురాలు విజి అధ్యక్షత వహించారు. ఉపాధ్యక్షుడు విజయ్ అధ్యక్షత వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ మాజీ అధ్యక్షురాలు మంజుల, విద్యావాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం



రాయచూరు డీసీ నితీశ్

రాయచూరు సెప్టెంబరు 5: జిల్లాలోని మాన్వి తాలూకా కపగల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడిన విద్యార్థుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా అందజేస్తున్నట్లు రాయచూరు జిల్లాధికారి నితీశ్ తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రోడ్డు రవాణా సంస్థ అధికారులతో మాట్లాడిన అనంతరం ఎక్స్‌గ్రేషియా అందజేసే ఏర్పాటు చేస్తామన్నారు. పూర్తిస్థాయి పరిహారానికి సంబంధించి ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందన్నారు. కాగా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవల్సిందిగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆదేశించినట్లు జిల్లాఅధికారి ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

విద్యార్థుల మృతికి మంత్రి శరణప్రకాశ్ పాటిల్ సంతాపం

రాయచూరు సెప్టెంబరు 5: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణంపాలు కావడంపట్ల రాయచూరు ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ శరణప్రకాశ్‌పాటిల్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి, గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యచికిత్సనందించాలని ఆదేశించారు. కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయ దినోత్సవం రద్దు..!

రాయచూరు సెప్టెంబరు 5: జిల్లాలోని మాన్వి తాలూకా కపగల్‌లో గురువారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పాఠశాల విద్యార్థులు మృతి చెందిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించతలపెట్టిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని రద్దు చేశారు. స్థానిక రంగమందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఎమ్మెల్సీ తదితరులు మాజీ రాష్ట్రపతి దివంగత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి, సావిత్రిబాయి పులె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు రోజుల క్రితం మృత్యువాత పడిన ఉపాధ్యాయుడికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అధికారులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తు వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



సర్వేపల్లి చిత్రపటానికి పులమాలలువేసి నివాళులర్పిస్తున్న దృశ్యం